సాక్షి సూర్యాపేట


శుక్రవారం । 5 । ఏప్రిల్ । 2024



ప్రపంచ పటంలో బౌద్ధక్షేత్రం
ఫణిగిరి బౌద్ధ క్షేత్రాన్ని పురావస్తుశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, డైరెక్టర్ భారతి హోలికేరి సందర్శించారు. - 8లో



అష్టోత్తర శతఘటాభిషేకం
మేళ్లచెరువులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. - 8లో



న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి



మాట్లాడుతున్న బెజవాడ వెంకటేశ్వర్లు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో ధర్మభిక్షం భవన్‌లో నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు ధాన్యాన్ని మధ్య దళారులకు అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వర్షాభావంతో ఇప్పటికే సగం వరి పంట ఎండిపోయిందన్నారు. ఎండిపోయిన వరి పంటకు ఎకరాకు రూ. 25 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు అనంతుల మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు చామల అశోక్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కొండలు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు కృషి

సూర్యాపేట: గంజాయి నిర్మూలనకు పోలీస్‌శాఖ కృషి చేస్తోందని జిల్లా ఎస్పీ బీకే రాహుల్ హెగ్డే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గంజాయి సరఫరా జరగకుండా పూర్తి స్థాయిలో నిఘా ఉంచి మూడేళ్లుగా జిల్లా వ్యాప్తంగా 166 కేసులు నమోదు చేసి 4258.53 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని 424 మంది నిందితుల పై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. వీరిలో 8 మంది పై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు తెలిపారు. మరో 84 కేసుల్లో స్వాధీనంలో ఉన్న 2743.16 కేజీల గంజాయిని నిర్వీర్యం చేయాలని సూర్యాపేట జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ నిర్ణయం పై నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ పదార్థాల చట్టం, పర్యావరణ సంస్థల నిబంధనల ప్రకారం వాతావరణ కాలుష్యం కాకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. గంజాయిని నిర్వీర్యం చేయడం పట్ల ప్రజలను తప్పు దోవ పట్టించేలా, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడానికి ఎవరైనా ప్రయత్నిస్తే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎస్పీ హెచ్చరించారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న వీరాంజనేయులు

సూర్యాపేటటౌన్ : తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించిన ఆర్టీసీ కార్మికుల సమస్యల్ని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆర్‌పీఎస్ 2017, హయ్యర్ పెన్షన్ పై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ కార్మికులపై పనిభారం పెరిగిందన్నారు. వేతన సవరణలో సర్వీస్ కండిషన్ల ఒప్పందం జరగలేదని, తక్షణమే కార్మిక సంఘాలతో చర్చించి సర్వీస్ కండిషన్ల ఒప్పందం చేసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 2021 వేతన సవరణ 16శాతం ఐఆర్‌తో ఇంప్లిమెంట్ చేయాలని డిమాండ్ చేశారు. 2013 వేతన సవరణ బకాయిలు అన్ని కేటగిరీలకు ఇవ్వాలన్నారు. ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.నర్సింహ, బత్తుల సుధాకర్, రంగు వెంకన్న, నరసింహయ్య, శ్యామ్, సోమయ్య, భాస్కర్ రావు, శ్రీధర్, వీరస్వామి, ఇంద్రయ్య, ఎల్లమ్మ, యాకమ్మ, ధనమ్మ, వెంకన్న, కొమరయ్య, బుచ్చయ్య సురేష్ పాల్గొన్నారు.

నేడు కేంద్ర బృందం రాక

భూదాన్‌పోచంపల్లి : కేంద్ర అధికారుల బృందం శుక్రవారం భూదాన్‌పోచంపల్లిని సందర్శించనున్నట్లు పోచంపల్లి చేనేత టై అండ్ డై అసోషియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు చేనేత కళాకారులు, వ్యాపారుల స్థితిగతులు, చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ అదనపు సెక్రటరీ, ఫైనాన్స్‌అడ్వైజరీ మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్ అర్షిత్ గోపాల్, వీవర్ సర్వీస్‌సెంటర్ రీజినల్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ రానున్నట్లు తెలిపారు.

శుద్ధ అబద్ధం





- ప్యూరిఫై వాటర్ పేరుతో దందా
- నాణ్యత ప్రమాణాలు పాటించని నిర్వాహకులు
- జిల్లాలో ఎక్కువగా అనధికారిక ప్లాంట్లే
- నెలకు రూ.2.25కోట్ల వ్యాపారం
- పట్టించుకోని అధికారులు


దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో శుద్ధ జలం పేరుతో దందా సాగుతోంది. ప్యూరిఫై వాటర్ పేరుతో సాధారణ నీరు సరఫరా చేస్తూ ఆర్‌ఓ ప్లాంట్ల నిర్వాహకులు ప్రజలను మోసం చేస్తున్నారు. శుభ్రంగా లేని క్యాన్లలోనే నీటిని నింపి విక్రయిస్తున్నారు. ఇలా ప్రమాణాలకు పాతరేస్తున్నా పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడు. నెలకు 15లక్షల క్యాన్ల నీళ్లు విక్రయిస్తున్నా. తద్వారా రూ. సుమారు రూ. 2.25 కోట్ల వరకు నీటి వ్యాపారం సాగుతోంది.

కోట్లలో బిజినెస్...
జిల్లాలో పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ప్యూరిఫై వాటర్ (శుద్ధ జలం) ప్లాంట్లు వెలిశాయి. ప్రభుత్వ అనుమతి లేకుండానే ప్లాంట్ల నిర్వాహకులు జోరుగా నీటి వ్యాపారం సాగిస్తున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోనే అనధికారికంగా 100కుపైగా ఉండగా జిల్లా వ్యాప్తంగా 500 ప్లాంట్లు ఉన్నాయి. ఇళ్లలోని బోర్లు, బావుల నుంచి నీటిని ట్యాంక్‌లలో నింపి, శుద్ధి చేయకుండానే రుచి కోసం కొంచెం రసాయనాలు కలిపి విక్రయిస్తున్నారు. 20 లీటర్ల క్యాన్ కు రూ.10నుంచి రూ. 15 వరకు వసూలు చేస్తున్నారు. ఒక్కో ప్లాంటు నుంచి రోజుకు 200 నుంచి 300 క్యాన్ల వరకు అమ్ముతున్నారు. ఇలా జిల్లాలో అనధికారికంగా రోజుకు సుమారు 10 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. అంటే నిత్యం 50 వేల క్యాన్ల ద్వారా నిర్వాహకులు రూ. 7.50 లక్షల చొప్పున నీటి వ్యాపారం చేస్తున్నారు.

యథేచ్ఛగా వ్యాపారం..
ఫ్లోరైడ్, కలుషిత నీటిపై ప్రజల్లో అవగాహన పెరగడంతో శుద్ధి నీటి కోసం పరుగులు పెడుతున్నారు. బోర్లు, రక్షిత పథకాల నుంచి వస్తున్న నీటిని ఇతర అవసరాలకు ఉపయోగిస్తూ తాగునీటి కోసం ప్యూరిఫై వాటర్ క్యాన్లు కొనుగోలు చేస్తున్నారు. ఇందు కోసం ఒక్కో కుటుంబం నెలకు రూ.400 నుంచి రూ.600 వరకు ఖర్చు చేస్తోంది. పెళ్లిళ్లు, విందులకు ప్లాంట్ల నిర్వాహకులు ఏకంగా డ్రమ్ములతో సరఫరా చేస్తూ భారీగా డబ్బు వసూలు చేస్తున్నారు. ప్యూరిఫై వాటర్‌కు డిమాండ్ పెరగడంతో ప్రభుత్వ అనుమతి లేకుండానే వీధికి రెండు, మూడు ప్లాంట్లు ఏర్పాటు చేసి యథేచ్ఛగా వ్యాపారం సాగిస్తున్నారు. వేసవికాలంలో అయితే ఈ దందా అధికంగా ఉంటుంది.

నిబంధనలకు పాతర...
ప్రతి శుద్ధ జల కేంద్రంలో బ్యూరో ఆఫ్ ఇండియా ప్రమాణాలు పాటించాలి. ఎస్‌ఎస్‌ఐ, ఐఎస్‌ఐ రిజిస్ట్రేషన్లతోపాటు, కాలుష్య నియంత్రణ, చెదలు నివారణ ధ్రువపత్రాలు, ట్రేడ్ మార్క్ రిజిస్ట్రేషన్ వంటి 14 మార్గ దర్శకాలు పాటించాల్సి ఉంటుంది. ప్లాంటు వద్ద అర్హత గల ల్యాబ్ టెక్నీషియన్లను నియమించాలి. రోజూ ఉదయం, సాయంత్రం నీటిని పరీక్షించి క్యాల్షియం, మెగ్నీషియం ఎంత మోతాదులో ఉందో గమనించాలి. క్యాన్లపై నీరు నింపిన తేదీని విధిగా ప్రచురించాలి. క్యాన్లను పరిశుభ్రంగా ఉంచాలి. కానీ ఈ నిబంధనలేవీ పట్టించుకోకుండా రోజుల తరబడి నిల్వ ఉన్న నీటిని, అపరిశుభ్ర క్యాన్లలోనే సరఫరా చేస్తుండడం గమనార్హం.

నెలకు రూ. 500 ఖర్చు చేస్తున్నాం



సూర్యాపేట పట్టణంలో తాగునీటికి వాటర్‌ప్లాంట్లపై ఆధారపడక తప్పని పరిస్థితి నెలకొంది. రోజూ ఒకటి, రెండు కాన్లు వాడుతాం. ప్రతి నెలా రూ. 500 వరకు తాగునీటికి ఖర్చు చేస్తున్నాం. ఈ నీరు తాగడం వల్ల మోకాళ్ల నొప్పులు వస్తున్నాయి. రోజూ నీరు రుచి మారుతున్నాయి.
– నున్న యాదగిరి, సూర్యాపేట

కొరవడిన పర్యవేక్షణ...
ప్యూరిఫైడ్ (శుద్ధి) నీటి పేరుతో మోసం చేస్తున్న ప్రైవేటు జల కేంద్రాలను అధికారులు నిత్యం తనిఖీ చేయాల్సి ఉంది. పంచాయతీ పరిధిలో పీహెచ్‌సీ వైద్యులు, ఆహార తనిఖీ అధికారి, ఎంపీడీఓలు తనిఖీ చేయవచ్చు. పట్టణ, నగరపాలక సంస్థ పరిధిలో పరిశ్రమల శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, టాస్క్‌ఫోర్స్ అధికారులు పరిశీలించాలి. అయితే ఆయా శాఖల మధ్య సమన్వయం లేక, సిబ్బంది మామూళ్లకు అలవాటు పడడంతో ప్లాంట్ల వైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలున్నాయి. ప్రతి 15 రోజులకోసారి భూగర్భజలశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నీటిని పరీక్షించి నాణ్యతా ప్రమాణాలు పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ ఎలాంటి పర్యవేక్షణ లేదు.

విద్యార్థులకు 'ప్రేరణ'

- ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళిక
- వచ్చే విద్యాసంవత్సరం 9నుంచి 12వ తరగతి వరకు చదివేవారికి అవకాశం
- ఎంపికైన వారికి ప్రధాని మోదీ చదివిన పాఠశాలలో శిక్షణ

హుజూర్‌నగర్ : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర మానవ వనరులశాఖ.. ప్రేరణ పేరుతో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను బహుముఖ ప్రజ్ఞాశాలి, విజ్ఞానవంతులు, బాధ్యత గల వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేసి వారికి వారం రోజుల పాటు గుజరాత్ రాష్ట్రంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ చదివిన పాఠశాలలో తొమ్మిది అంశాలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి పాఠశాల, కళాశాల స్థాయిలో విద్యార్థుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది.

గుజరాత్‌లోని వాదానగర్ పాఠశాలలో..
గుజరాత్‌లోప్రధాని మోదీ చదివిన వాదానగర్ పాఠశాలను ఆ రాష్ట్ర ప్రభుత్వం మ్యూజియంగా తీర్చిదిద్దింది. ప్రేరణ కార్యక్రమంలో భాగంగా ప్రతి జిల్లా నుంచి ఒక బాలుడు, ఒక బాలికను ఒక ఉపాధ్యాయురాలిని గైడ్ టీచర్‌గా ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణకు ఆ పాఠశాలకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడ ఏడు రోజుల పాటు జరిగే శిక్షణలో ఒక్కో బ్యాచ్‌లో 10 జిల్లాలకు చెందిన 20 మంది విద్యార్థులు పాల్గొంటారు. ఇలా శిక్షణ పొందిన వారిని అంబాసిడర్లు (రాయబారులు)గా పరిగణిస్తారు. పాఠశాల, జిల్లా స్థాయిల్లో విద్యార్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగనుంది. నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. ఆయన ఆధ్వర్యంలో తుది ఎంపిక జరగనుంది.

పోటీలు నిర్వహించి ఎంపిక
జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరంలో 9 నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులు ప్రేరణ పోర్టల్‌లో కోరిన వివరాలు నమోదు చేసుకునేందుకు ఈ నెల 2నుంచి వారం రోజుల పాటు పాఠశాలల్లో ప్రేరణ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో నమోదు చేసుకున్న బాలబాలికల నుంచి పాఠశాలల స్థాయిలో ప్రతిభ, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, కొత్త విషయాలపై ఆసక్తి తదితర అంశాలను పరీక్షించి ప్రతి పాఠశాల నుంచి ఒక బాలుడు, ఒక బాలికను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలోనూ ప్రేరణ ఉత్సవాలు ఉంటాయి. ఇందులో నాకిష్టం, నాదృష్టిలో భారతదేశం, వికసిత్ భారత్ అనే అంశాలపై పోటీలు నిర్వహించి 20 మందిని ఎంపిక చేస్తారు. వారిలో 10 మంది బాలికలు, మరో 10 మంది బాలురు ఉంటారు. మూడో దశలో నవోదయ విద్యాలయంలో ప్రిన్సిపల్ (నోడల్ అధికారి) ఆధ్వర్యంలో వీరికి వివిధ అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తారు. అన్ని కోణాల్లో పరీక్షించి అత్యంత ప్రతిభ కనబరిచిన ఓ బాలిక, ఒక బాలుడిని, ఒక గార్డియన్స్ ఉపాధ్యాయురాలిని ఎంపిక చేస్తారు. వీరిని గుజరాత్ లోని వాదానగర్ పాఠశాలలో ప్రత్యేక శిక్షణ కోసం పంపిస్తారు.



శిక్షణ ఇలా..
జిల్లా స్థాయిలో దేశీయ విజ్ఞానం, సాంకేతికత, సృజనాత్మకత, స్ఫూర్తిదాయకమైన నాయకులు, క్షేత్ర సందర్శన, యోగా, ధ్యానం తదితర విషయాలపై శిక్షణ ఇస్తారు. గుజరాత్‌లోని శిక్షణ కేంద్రంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులను ఒక్క చోట చేర్చి విభిన్న నాగరికతలపై వారికి అవగాహన కల్పిస్తారు. అయిదు రోజుల పాటు నిపుణుల ప్రసంగాలు, రెండు రోజుల పాటు క్షేత్ర పర్యటనలు ఉంటాయి. అక్కడ స్వాభిమాన్, శౌర్య, సాహస్, పరిశ్రమ్,కరుణ -సేవ, భిన్నత్వంలో ఏకత్వం, సత్యనిష్ఠ, కుతూహలం - కొత్త విషయాలపై ఆసక్తి, శ్రద్ధ-విశ్వాస్, స్వతంత్రత-కర్తవ్య అనే అంశాలపై సమగ్రంగా విద్యార్థులకు తర్ఫీదు నిస్తారు.

పట్టభద్రుల ఓటర్ల తుది జాబితా విడుదల

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటర్ల తుది జాబితాను గురువారం విడుదల చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకటరావు తెలిపారు. రెవెన్యూ డివిజన్ల వారీగా సూర్యాపేటలో 26,059, కోదాడ 12,120, హుజూర్‌నగర్ 13,111 ఇలా మొత్తం 51,290 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు నమోదైనట్లు వివరించారు. జిల్లాలో మొత్తం 71 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, వీటిలో సూర్యాపేటలో 31 పోలింగ్ కేంద్రాలు, కోదాడ 22 , హుజూర్‌నగర్ 18 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు వెల్లడించారు.

మాదిగలను మోసం చేసే పార్టీల పతనం తప్పదు

భానుపురి (సూర్యాపేట) : ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం సరైనది కాదని, మాదిగలను మోసం చేసే పార్టీలకు పతనం తప్పదని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న మాదిగ అన్నారు. గురువారం సూర్యాపేట పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్ లోగల అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంగా చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి తన సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకే ప్రాధాన్యమివ్వడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. రాష్ట్రంలో 12 శాతం ఉన్న మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం దురదృష్టకరమని చెప్పారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చింతలపాటి చిన్న శ్రీరాములు, ఎర్ర వీరస్వామి, బోడ శ్రీరాములు, బొజ్జ వెంకన్న, దైద వెంకన్న, చెరుకు సతీష్, శ్రీను, నవీన్, గోపి, సైదులు, మధు, సందీపు, మైసయ్య, వెంకట రాములు, భిక్షం పాల్గొన్నారు.



సూర్యాపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న నేతలు

సలహాలిస్తూ.. సందేహాలు నివృత్తి చేస్తూ..

- కలెక్టరేట్‌లో అందుబాటులో ఓటరు సహాయ కేంద్రం
- 1950 హెల్ప్‌లైన్ ద్వారా ఎనిమిది రకాల సేవలు
- నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదులకు అవకాశం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : లోక్‌సభ ఎన్నికలు జరగనున్న ప్రస్తుత తరుణంలో ఓటర్ల సందేహాల నివృత్తికి ఎన్నికల సంఘం ప్రాధాన్యమిస్తోంది. ఇందులో భాగంగా ఓటరు సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. దీంతో ఇటీవల జిల్లా కలెక్టరేట్‌లో దీనిని ఏర్పాటు చేశారు.

ఎనిమిది రకాల సేవలు..
ఓటరు హెల్ప్‌లైన్ 1950 ద్వారా ఎనిమిది రకాల సేవలు అందిస్తున్నారు. పోలింగ్, ఎన్నికల క్రతువు సజావుగా నిర్వహించేందుకు ఫిర్యాదులు, అభిప్రాయాల స్వీకరణ, ఎన్నికల అధికారికి సంబంధించిన వివరాలు, శాసనసభ నియోజకవర్గ సమాచారాన్ని ఓటర్లకు తెలియజేయడం, ఓటరు నమోదు, పోలింగ్ కేంద్రం చిరునామా, ఎన్నికల సమాచారం, 24 గంటలు ఓటర్లకు సహాయం అందించడం వంటి సేవలు ఇందులో ఉన్నాయి.

24 గంటలూ అందుబాటులో సిబ్బంది
ఓటరు సహాయ కేంద్రం 24 గంటలూ పనిచేస్తుంది. ఇందులో సిబ్బంది షిఫ్టుల పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. ఓటర్లు 1950 నంబరుకు ఫోన్ చేయడం ద్వారా తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు వీలుంటుంది. ఫోన్, చిరునామా నమోదు చేసుకుంటున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా రిజిస్టర్ నిర్వహిస్తున్నారు. అదే సమయంలో సంబంధిత వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. సగటున నిత్యం 20 మంది వరకు ఫోన్ చేస్తున్నారు.



కలెక్టరేట్‌లోని ఓటరు సహాయ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

అక్రమాలు గుర్తిస్తే..
ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగాలంటే నిబంధనలు పక్కగా అమలు కావాల్సిందే. ఉల్లంఘనలకు తావిస్తే సరైన అభ్యర్థులు ఎన్నికయ్యే అవకాశం ఉండదు. ఈ విషయంలో ఓటర్లు అప్రమత్తంగా ఉండాలి. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు గుర్తిస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలి. నిబంధనల ఉల్లంఘనపై 1950కి తెలియజేయాలి. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతారు. ఫిర్యాదును వెంటనే సంబంధిత అధికారికి పంపి అక్రమాల కట్టడికి చర్యలు తీసుకుంటారు

ఫిర్యాదులపై అధికారులు స్పందించేలా..
ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ప్రస్తుతం జిల్లా యంత్రాంగం ముందుకు సాగుతోంది. ఇంకా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో సహాయ కేంద్రానికి ఎక్కువగా ఓటరు జాబితాకు సంబంధించిన ఫిర్యాదులే వస్తున్నాయి. దరఖాస్తు చేసినా ఇంకా ఓటు హక్కు రాలేదని కొందరు, ఇప్పటికే జాబితాలో పేరున్నా ఈ సారి పోలింగ్ కేంద్రం మారిందని మరికొందరు సహాయ కేంద్రానికి ఫోన్ చేస్తున్నారు. ఏప్రిల్ 18వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలు కానుండటంతో ఫిర్యాదుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఫిర్యాదుల వివరాలను సంబంధిత అధికారులకు చేరవేస్తున్నారు. కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసిన వారిలో జాబితాలో చోటు దక్కని వారి నుంచి ఫిర్యా దులపై అధికారులు వెంటనే స్పందించేలా చూస్తున్నారు

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి అనితా రామచంద్రన్, చిత్రంలో కలెక్టర్, అదనపు కలెక్టర్



కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశానికి హాజరైన అధికారులు

వేసవిలో ప్రతి గ్రామానికి తాగునీరు చేరాలి
- అధికారులు సమన్వయంతో పనిచేయాలి.
- ప్రత్యేక అధికారి అనితా రామచంద్రన్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లా వ్యాప్తంగా తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ప్రత్యేక అధికారి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో తాగునీటిపై ఏర్పాటు సమీక్షా సమావేశంలో కలెక్టర్ ఎస్. వెంకటరావు, అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిసి పాల్గొని మాట్లాడారు. ఈ మూడు మాసాలు అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో నీటి ఎద్దడి రాకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ ప్రకారం పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో నీటి నిల్వలు, లభ్యత, డిమాండ్‌లను దృష్టిలో ఉంచుకొని ముందుకెళ్లాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన హ్యాండ్ పంప్స్, పంప్‌సెట్స్, ఓపెన్‌వెల్స్, పైప్ లైన్‌లను సత్వరమే అందుబాటులోకి తేవాలన్నారు. కొత్త బోర్లకు అనుమతులివ్వొద్దని, అవసరం ఉంటే వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకొని వినియోగించుకోవాలన్నారు. వివిధ గ్రాంట్స్ ద్వారా మంజూరైన పనులు పది రోజుల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ రూరల్ ప్రాంతాల్లో ఎస్‌డీఎఫ్ కింద రూ.363.5 లక్షలతో చేపట్టిన 184 పనుల్లో 151 పూర్తి కాగా మిగిలిన 33 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. డీఎంఎఫ్‌టీ కింద రూ. 700.35 లక్షలతో మంజూరైన 278 పనుల్లో 211 పూర్తి కాగా 67 పనులు పురోగతిలో ఉన్నాయని, ఎమ్మెల్యే నిధులు రూ.329 లక్షలతో చేపట్టిన 631 పనుల్లో 238 పూర్తి కాగా 393 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఇతర గ్రాంట్స్ కింద రూ.82. 846 లక్షలతో చేపట్టిన 1,806 పనుల్లో 1,642 పనులు పూర్తి కాగా 164 పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంబీ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, సీఈఓ అప్పారావు, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, ఆర్‌డీఓలు సూర్యనారాయణ, వేణు మాధవ్, శ్రీనివాస్, ఎంబీ ఇంట్రా శ్రీనివాస రావు, గ్రిడ్ అరుణాకర్ రెడ్డి, ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓ లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీఓలు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు నిధుల కొరతలేదు

మునగాల(కోదాడ): ప్రభుత్వం తాగునీటి సౌకర్యం కల్పించడానికి నిధులు కేటాయించిందని, తాగు నీటి సరఫరాకు నిధుల కొరత ఏమీ లేదని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి , రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ అనితా రామచంద్రన్ అన్నారు. గురువారం మునగాల మండలం మాధవరంలో గల మంచినీటి ప్రాజెక్టును కలెక్టర్ వెంకటరావు, అదనపు కలెక్టర్ ప్రియాంక, మిషన్‌భగీరథ ఉన్నతాధికారులతో కలిసి తనిఖీ చేశారు. పంప్‌హౌస్ మరమ్మతు పనులను పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని పరిశీలించారు. అనంతరం మిషన్ భగీరథ ఉన్నతాధికారులు, కలెక్టర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో మిషన్ భగీరథ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉపాధిహామీ పథకంలో అధిక సంఖ్యలో కూలీలను మొబిలైజ్ చేయాలని, వేతనం పెంచి ఇవ్వడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఉపాధి కూలీలకు అవగాహన మార్కింగ్ ఇచ్చి పనులు చేయించాలని ఆమె ఆదేశించారు. పనిప్రదేశంలో నీడనిచ్చే నెట్, తాగునీటి సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని వాటిని వినియోగంలోకి తీసుకువచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. ఆమె వెంట మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ అరుణ్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ భిక్షం, స్థానిక ఏఈ రుత్విక్, ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, తహసీల్దార్ వలిగొండ అంజనేయులు, ఎంపీఓ భూపాల్‌రెడ్డి, ఉపాధి ఏపీఓ శైలజ, టెక్నికల్ అసిస్టెంట్ శేఖర్, ఫీల్డ్‌అసిస్టెంట్ శ్రీదేవి, మాధవరం పంచాయతీ కార్యదర్శి అక్షిత ఉన్నారు.



మునగాల: మాధవరంలో తాగునీటి ప్రాజెక్ట్ పంప్‌హౌస్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి అనితారామచంద్రన్

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తుతెలియని మృతదేహం

రామగిరి (నల్లగొండ): తిప్పర్తి మండల పరిధిలోని జొన్నగడ్డలగూడెం గ్రామ శివారులో గురువారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జొన్నగడ్డలగూడెం గ్రామ శివారులోని రైల్వే అండర్ పాస్ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న గడ్డిలో గుర్తుతెలియని మృతదేహాన్ని గ్రామానికి చెందిన పశువుల కాపరులు గురువారం సాయంత్రం గుర్తించారు. అప్పటికే మృతదేహం కుళ్లిపోయి గుర్తుపట్టలేకుండా ఉంది. అటుగా వస్తున్న పశువుల కాపర్లు దుర్వాసన వస్తుండటంతో వెళ్లి చూడగా వారికి మృతదేహం కనిపించింది. వెంటనే తిప్పర్తి పోలీసులకు సమాచారం అందించడంతో క్లూస్ టీం వచ్చి వివరాలు సేకరించినట్లు తెలిసింది. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ మాజీ సర్పంచ్ మృతి

నల్లగొండ క్రైం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నల్లగొండ మండలంలోని జీకే అన్నారం మాజీ సర్పంచ్ బోదనపు వెంకట్‌రెడ్డి (67) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. 10 రోజుల క్రితం ఆయన కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా.. చౌటుప్పల్ వద్ద కారు అదుపుతప్పి ముందు ఉన్న లారీని ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వెంకట్‌రెడ్డికి తీవ్రంగా గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా పనిచేసిన వెంకట్‌రెడ్డి మృతి పట్ల నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పిల్లి రామరాజుయాదవ్, మారగోని గణేష్‌గౌడ్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

లారీని ఢీకొట్టిన కారు.. మహిళ దుర్మరణం


లారీని ఢీకొట్టిన కారు

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై హైదరాబాద్ మార్గంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా బలిపర్వ మండలం కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన బోజ స్వరాజ్యం(60), తన అల్లుడు గోవిందవరపు సురేష్ కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఆ క్రమంలో చౌటుప్పల్ పట్టణ శివారులో తహసీల్దార్ కార్యాలయం వద్ద ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో స్వరాజ్యం తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

ప్రపంచ పటంలో ఫణిగిరి బౌద్ధక్షేత్రం

- పురావస్తుశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, డైరెక్టర్ భారతి హోలికేరి


సీసపు నాణేలను పరిశీలిస్తున్న శైలజా రామయ్యర్, భారతి హోలికేరి

నాగారం: మండల పరిధిలోని ఫణిగిరి బౌద్ధ క్షేత్రంపై లభించిన ఇక్ష్వాకుల కాలం నాటి నాణేలు, బౌద్ధ శిల్పాలతో మారుమూలనున్న ఆ గ్రామం ప్రపంచ పటంలో నిలిచిందని రాష్ట్ర పురావస్తుశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, పురావస్తుశాఖ రాష్ట్ర డైరెక్టర్ భారతి హోలికేరి అన్నారు. ఫణిగిరి కొండపై జరుపుతున్న తవ్వకాల్లో బయల్పడిన సీసపు నాణేలకు సంబంధించిన వివరాలను గురువారం విలేకరులకు వెల్లడించారు. ఫణిగిరి బౌద్ధక్షేత్రంపై ఒకే కుండలో 3,730 సీసపు నాణేలు లభించాయని, ఒకే చోట ఇంత పెద్ద మొత్తంలో నాణేలు లభించడం భారతదేశ చరిత్రలో తొలిసారి అని పేర్కొన్నారు. ఈ సీసపు నాణేలపై ఒక వైపు ఏనుగు, మరొక వైపు ఉజ్జయిని గుర్తులు ఉన్నాయని, ఇవి ఇక్ష్వాకుల కాలం నాటి నాణేలుగా నిర్ధారించామన్నారు. ఫణిగిరిలో మ్యూజియం నిర్మాణానికి కలెక్టర్ తన పూర్తి సహకారాన్ని అందించారని, దీని ద్వారా ఇక్కడ తవ్వకాల్లో లభించిన చారిత్రక ఆధారాలు, పురాతన ఆధారాలు పర్యాటకులు తిలకించే విధంగా ఏర్పాటు చేశామన్నారు. బౌద్ధక్షేత్రంపై లభించిన బౌద్ధ మహాస్థూపం, ఉద్దేశిక స్థూపాలు, సభ మండపాలు, శిలా శాసనాలు, నాణేలు, వీటన్నిటికీ ఫణిగిరి గ్రామ ప్రజలే వారసులని, అందరం కలిసి ఫణిగిరిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుదామని అన్నారు. ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ ఫణిగిరి కొండపై ఏడుసార్లు తవ్వకాలు జరిపామన్నారు. ఇంకా రెండు చోట్ల తవ్వకాల అనుమతికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ఫణిగిరిలో ఎంతో విలువైన చారిత్రక ఆధారాలు లభిస్తున్నాయని అందులో ముఖ్యమైనవి విహారాలు, గాజు, రాతి పూసలు, విరిగిన సున్నపు రాతి విగ్రహాలు ఉన్నాయని చెప్పారు. 2400 ఏళ్ల క్రితమే ఎలాంటి సాంకేతిక పరికరాలు లేని రోజుల్లోనే పెద్ద పెద్ద రాళ్లను కొండల పైకి తీసుకువచ్చి శిల్పాలుగా మలిచి బౌద్ధ చరిత్రను చాటారని అన్నారు. ఇక్కడ లభించిన బౌద్ధ స్థూపాలను కొన్ని అమెరికాలోని న్యూయార్క్ మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, పురావస్తుశాఖ ఉప సంచాలకుడు నారాయణ, అదనపు సంచాలకుడు మల్లు నాయక్, తహసీల్దార్ బ్రహ్మయ్య, గ్రామస్తులు పులిగిళ్ల వీరమల్లు యాదవ్ పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి

- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు


ప్రమాదానికి గురైన ట్రాలీ ఆటో

కేతేపల్లి: అదుపుతప్పి ఆటో బోల్తా పడడంతో మహిళ మృతిచెందింది. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం ఇస్తళాపురం గ్రామానికి చెందిన ఆమనగంటి అశోక్ ఇటీవల కొత్త ట్రాలీ ఆటోను కొనుగోలు చేశాడు. ఈ ఆటోను హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీలో చెత్తను తరలించేందుకు లీజు ప్రాతిపదికన పెట్టి వాహనాన్ని తానే స్వయంగా నడిపిస్తున్నాడు. కుటుంబ సభ్యులతో కలసి హైదరాబాద్‌లోనే నివాసం ఉంటున్నాడు. ఈ నెల 1వ తేదీన స్వగ్రామం ఇస్తళాపురంలో ఎల్లమ్మ పండుగ చేసేందుకు అశోక్ తన కుటుంబంతో కలసి ఆటోలో వచ్చాడు. పండుగ పూర్తయిన అనంతరం బుధవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో తిరిగి హైదరాబాద్‌కు బయల్దేరాడు. మార్గమధ్యలో కేతేపల్లి మండలంలోని ఇనుపాముల బస్ స్టేజీ సమీపంలోకి చేరుకోగానే విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న అశోక్ తల్లి ఆమనగంటి ఎల్లమ్మ(55), తండ్రి సత్తయ్య, ఇతర కుటుంబ సభ్యులు అనంతమ్మ, భారతమ్మ, పూలమ్మ, మల్లయ్య తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ ఆమనగంటి ఎల్లమ్మ మృతి చెందింది. బాధితుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కేతేపల్లి ఎస్ఐ శివతేజ తెలిపారు.

కుమార్తె పెళ్లికి వెళ్తుండగా ప్రమాదం

- రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు
- ముహూర్తం దాటిపోతుండడంతో తల్లిదండ్రులు లేకుండానే పెళ్లి


ఘటనా స్థలంలో పడి ఉన్న సైదులు, మంగ

కొణిజర్ల: కుమార్తె పెళ్లి ఘనంగా చేయడానికి సిద్ధమైన తల్లిదండ్రులు స్వగ్రామం నుంచి కల్యాణ వేదిక వద్దకు వెళ్తుండగా మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. చివరకు వధువు తల్లిదండ్రులు లేకుండానే బంధువులు కల్యాణతంతు నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం నల్లబండగూడెంకు చెందిన ఏదులాపురం సైదులు, మంగ దంపతుల ఏకైక కుమార్తె రమ్య వివాహం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తుమ్మలపల్లికి చెందిన బొడ్డుపల్లి నరేందర్‌తో నిశ్చయమైంది. తుమ్మలపల్లిలో గురువారం ఉదయం 9.15 గంటలకు వివాహం జరగాల్సి ఉండగా.. బుధవారం రాత్రే బంధువులతో పాటు కుమార్తెను పంపించారు. గురువారం ఉదయం సైదులు, మంగ ద్విచక్ర వాహనంపై తుమ్మలపల్లి వస్తుండగా గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల సమీపంలో వారి వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో దంపతులిద్దరి తలకు తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో ఖమ్మం తరలించారు. వివాహ ముహూర్త సమయం దాటి పోతుండడంతో వధువు తల్లిదండ్రులు లేకుండానే వివాహ తంతు ముగించారు. కన్న కూతురు వివాహ వేడుకను వారు చూడలేకపోయారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

నార్కట్‌పల్లి: కడుపు నొప్పి భరించలేక పురుగుల మందు తాగిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు.. నార్కట్‌పల్లి మండలంలోని ఏనుగులదోరి గ్రామానికి చెందిన పన్నాల శంకర్‌రెడ్డి(78) కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో, తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. కడుపునొప్పి భరించలేక ఈ నెల 2వ తేదీ రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. గురువారం మృతుడి కుమారుడు పన్నాల పాపిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు.

గంజాయి నిర్మూలనలో భాగస్వాములు కావాలి

- సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు తదితరులు

సూర్యాపేట: గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలు, కల్తీ కల్లు నిర్మూలించడం పట్ల ప్రజలు, యువత అవగాహన కలిగి ఉండాలని రూపొందించిన ప్రజా అవగాహన పోస్టర్ ఎస్పీతో పాటు, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు కలిసి గురువారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో వారు రూపొందించిన ఈ పోస్టర్లను జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లకు అందించామన్నారు. గంజాయి వల్ల సమాజానికి హాని ఉందని, యువశక్తి నిర్వీర్యం అవుతుందన్నారు. గంజాయి నిర్మూలన, వాటి మూలాలను తొలగించడం కోసం జిల్లా పోలీసు శాఖ పటిష్ఠంగా పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ జనార్దన్‌రెడ్డి, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐలు రాము, రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ స్థాయి నాటకోత్సవాలు


ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ: పట్టణంలోని మినీ రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పద్య, సాంఘిక నందిని నాటకోత్సవాలు గురువారం ముగిశాయి. ఆరో రోజు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ సంగనభట్ల నర్సయ్య, సీనియర్ రంగస్థల నటుడు నూకల జానకిరాములు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి వెలిగించి నాటకోత్సవాలను ప్రారంభించారు. పల్నాడు జిల్లాకు చెందిన టి.కృష్ణ థియేటర్స్ మిట్టపాలెం వారు 'ప్రేమించే వయసేన' అనే సాంఘిక నాటికను, గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన అరవింద ఆర్ట్స్ వారు 'జరుగుతన్న కథ' అనే సాంఘిక నాటికను ప్రదర్శించారు. కాగా నాటకోత్సవాల ముగింపు కార్యక్రమానికి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హాజరై ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు, నగదు ప్రదానం చేశారు. ఉత్తమ జ్యూరీ ప్రదర్శనగా స్వామి అయ్యప్ప నాటకం, ద్వితీయ ప్రదర్శనగా శ్రీకృష్ణ, కర్ణార్జునీయం, తృతీయ ప్రదర్శనగా మైరావణ, ఉత్తమ ప్రదర్శనగా మాధవవర్మతో పాటు ఉత్తమ రంగాలంకరణగా సురభి సంతోష్, ఉత్తమ ఆహార్యంగా చింతా శ్రీనివాస్, ఉత్తమ సంగీతం విభాగంలో ఎ. శివ సుబ్రహ్మణ్యం, ఉత్తమ జ్యూరీలుగా హారిక, చాగంటి సాయిలక్ష్మీతో పాటు మరికొంతమందికి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు ధీరావత్ స్కైలాబ్‌నాయక్, మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమళ్ల రామచంద్రరావు, అధ్యక్ష, కార్యదర్శులు భుజంగరావు, పులి కృష్ణమూర్తిశర్మ, గ్యార సాయిలు, కోశాధికారి పుల్లాభట్ల లక్ష్మీనారాయణశర్మ, కాంగ్రెస్ నాయకుడు జానకిరాంరెడ్డి, చంద్రశేఖర్‌రావు, జానకిశర్మ, ఎండీ ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే భద్రాద్రి రామయ్య తలంబ్రాలు

- రూ.151 చెల్లిస్తే ఆర్టీసీ కార్గో ద్వారా అందజేత
- ఈ నెల 18వ తేదీ వరకు అవకాశం



మిర్యాలగూడ టౌన్: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో జరిగే సీతారామచంద్రుల కల్యాణోత్సవంలో ఉపయోగించే తలంబ్రాలను భక్తులు ఇంటికి తీసుకెళ్తుంటారు. అయితే శ్రీరామనవమి వేడుకలకు భద్రాచలం వెళ్లలేకపోయిన భక్తులకు ఇంటి వద్దకే తలంబ్రాలు అందించాలని ఆర్టీసీ నిర్ణయించింది. అందులో భాగంగా గతంలో మాదిరిగానే ఈసారి కూడా దేవదాయ ధర్మాదాయ శాఖ సహకారంతో రాములోరి తలంబ్రాలను భక్తుల ఇంటి వద్దకే చేర్చే కార్యక్రమానికి ఈ నెల 4వ తేదీన శ్రీకారం చుట్టింది. తలంబ్రాలు కావాలనుకునే భక్తులు ఈ నెల 18వ తేదీ వరకు టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ (కార్గో) కేంద్రాలలో రూ.151 చెల్లించి తమ పేర్లు, వివరాలు నమోదు చేసుకుంటే కల్యాణం అనంతరం ఆర్టీసీ ద్వారా ఇంటికి తీసుకొచ్చి ఇస్తారు.

తలంబ్రాల బుకింగ్ కోసం డిపోల వారీగా సంప్రదించాల్సిన నంబర్లు

డిపో	అధికారి	ఫోన్ నంబర్
మిర్యాలగూడ	పరింగి నాగేశ్వర్‌రావు	9154298693
నల్లగొండ	సైదులు	9154288691
దేవరకొండ	హరిలాల్	9154298694
నార్కట్‌పల్లి	యాదయ్య	9154298692
సూర్యాపేట	జానీపాష	9154298695
కోదాడ	రాజశేఖర్	9154298696
యాదగిరిగుట్ట	భాస్కర్	9154298697
రీజినల్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్	శ్యాం	9154298690
అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్	సి. రవీందర్	8125451791

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదగిరిగుట్ట, నార్కట్‌పల్లి, దేవరకొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, నల్లగొండ ఆర్టీసీ డిపోల పరిధిలో 2022లో భద్రాచలం రాములోరి తలంబ్రాల కోసం ఆర్టీసీ లాజిస్టిక్ (కార్గో) ద్వారా 11,111 మంది పేర్లు నమోదు చేసుకోగా ఆర్టీసీకి రూ.8,88,880 ఆదాయం వచ్చింది. అదేవిధంగా గతేడాది 2023లో 11,680 మంది పేర్లు నమోదు చేసుకోగా రూ.13,54,880 ఆర్టీసీకి ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా భద్రాచలం రాములవారి కల్యాణ తలంబ్రాలకు సంబంధించిన బుకింగ్ ప్రారంభమైంది. భక్తులు ఆయా డిపోల పరిధిలోని లాజిస్టిక్(కార్గో) కేంద్రాల ద్వారా బుకింగ్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్ ద్వారా కూడా డబ్బులను చెల్లించి పేర్లు నమోదు చేసుకొని రశీదు పొందవచ్చు. కల్యాణం అనంతరం ఇంటి వద్దకు ఆర్టీసీ సిబ్బంది వచ్చి రాములవారి తలంబ్రాలు అందిస్తారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీదేవి, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, నల్లగొండ

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

నార్కట్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు గురువారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండకు చెందిన తండు మహేష్ (35) బుధవారం సాయంత్రం నల్లగొండ నుంచి రామన్నపేటకు బైక్‌పై వెళ్తుండగా.. నార్కట్‌పల్లి సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మహేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

చౌటుప్పల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై గురువారం జరిగింది. వివరాలు.. వలిగొండ మండలం గొల్నేపల్లి గ్రామానికి చెందిన కందాటి మోహన్‌రెడ్డి(71) కుటుంబ సభ్యులతో కలిసి రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో నివాసముంటున్నాడు. సొంతూరిలో వ్యవసాయం చేస్తుంటాడు. ఇటీవల వరి పంట కోసి పొలం వద్దనే ధాన్యాన్ని ఆరబోశారు. గురువారం ద్విచక్ర వాహనంపై సొంతూరుకు వెళ్తుండగా.. మార్గమధ్యలో చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామం వద్ద బ్రిడ్జి దాటాక వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మోహన్‌రెడ్డిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమారుడు సురేందర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

ట్రాక్టర్, బైక్ ఎదురెదురుగా ఢీకొని..

నేరేడుచర్ల: ట్రాక్టర్, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం నేరేడుచర్ల మండలం సోమారం గ్రామ శివారులో జరిగింది. ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామం నుంచి ధాన్యం లోడుతో ట్రాక్టర్ మిర్యాలగూడ వైపు వెళ్తుండగా.. అదే సమయంలో గరిడేపల్లి మండలం ముత్యాలమ్మగూడేనికి చెందిన మిగిడి జానయ్య(48) బైక్‌పై నేరేడుచర్ల మండలం సోమారం గ్రామం నుంచి కల్లూరు వైపు వెళ్తున్నాడు. ట్రాక్టర్, బైక్ సోమారం గ్రామ శివారులో ఎదురెదురుగా ఢీకొనడంతో జానయ్య కిందపడడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. జానయ్యను చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గూడూరు టోల్‌ప్లాజాకు 'శుభకార్యాల' ఎఫెక్ట్

- బారులుదీరిన వాహనాలు


టోల్‌ప్లాజా వద్ద వాహనాల బారులు

బీబీనగర్: మండల పరిధిలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద గురువారం శుభకార్యాల ఎఫెక్ట్ కనిపించింది. గురువారం అధికంగా వివాహాలు, శుభకార్యాలు ఉండటంతో జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి గూడూరు టోల్‌ప్లాజా మీదుగా ప్రయాణికులు రాకపోకలు సాగించడంతో వాహనాల రద్దీ పెరిగింది. ముఖ్యంగా ఉదయం నుంచి మధ్యాహ్నం, సాయంత్రం నుంచి రాత్రి వరకు వాహనాల రద్దీ నెలకొంది. దీంతో టోల్‌ప్లాజాకు రెండు వైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ఫాస్టాగ్ స్కానింగ్ కూడా ఆలస్యం కావడంతో టోల్‌ప్లాజాకు ఇరువైపులా వాహనాలు కిలోమీటర్ మేర బారులుదీరాయి.

- సూర్యాపేటలో రోడ్డు ప్రమాదం


సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటరావు


రుక్కమ్మ మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబ సభ్యులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు


ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుల బంధువులు, కుటుంబ సభ్యులు


లునావత్ రుక్కమ్మ మృతదేహం


చింతరెడ్డి సరితారెడ్డి మృతదేహం


వేదాశ్విని మృతదేహం

బైక్ పైనుంచి పడి యువకుడు మృతి

హుజూర్‌నగర్: మండల పరిధిలోని అమరవరం శివారులో దొంగలదుబ్బ ప్రాంతంలో మూలమలుపు వద్ద బైక్ పైనుంచి పడి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలం హనుమంతులగూడెం గ్రామానికి చెందిన తుపాకుల లక్ష్మీనారాయణ(30) మద్యం సేవించి బైక్‌పై హుజూర్‌నగర్ వస్తుండగా.. అమరవరం గ్రామ శివారులోని దొంగలదుబ్బ ప్రాంతంలో మూలమలుపు వద్ద పొలాల్లో పడిపోయి మృతిచెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ చరమందరాజు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఏరియా హాస్పిటల్ తరలించారు. కాగా ఈ ఘటనపై తమకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వైభవంగా అష్టోత్తర శతఘటాభిషేకం

మేళ్లచెరువు: మండల కేంద్రంలోని మైహోం సిమెంట్ పరిశ్రమ నందు గల శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం అష్టోత్తర శతఘటాభిషేకం కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పీఠంపై అధిష్ఠింపజేశారు. స్వామి, అమ్మవార్లకు ఎదురుగా 108 కలశాలను ఒక క్రమ పద్ధతిలో ఏర్పాటు చేశారు. వాటికి ఎదురుగా ప్రధాన కలశంలో శుద్ధమైన గంగాజలానికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలశాలకు ఆలయ అర్చకులు మంత్రించిన నీటితో అభిషేకం నిర్వహించారు. దీంతో ఏడు రోజులుగా నిర్వహిస్తున్న ఆలయ బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు పరిశ్రమ అధికారులు తెలిపారు. అదేవిధంగా భక్తులచే నిర్వహించిన గాత్ర కచేరి ఆకట్టుకుంది. వారం రోజులుగా పూజలు నిర్వహించిన వేద పండితులను సత్కరించారు. కార్యక్రమంలో మైహోం సిమెంట్ పరిశ్రమ చైర్మన్ డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు, కుమారి దంపతులు, మునగాల రామ్మోహన్‌రావు దంపతులు, యూనిట్ హెడ్ శ్రీనివాసరావు, పరిశ్రమ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.